క్లుప్తంగా

ఈనెల 25న పశువుల సంత వేలం

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంత, కూరగాయల తైబజారు బహిరంగ వేలం ఈనెల 25న నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం ఉంటుందని కార్యదర్శి సాయన్న శనివారం తెలిపారు.

నవాబుపేటలో నేడు..

నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం తైబజార్ వేలం ఉంటుందని పంచాయతీ అధికారి నరేష్ తెలిపారు. మార్చిలోనే తైబజార్ పూర్తి కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వేలం పాట నిర్వహించలేదన్నారు. తాజాగా నిర్వహించే వేలంలో పాల్గొన దలచిన వారు రూ. 25 డీడీని గ్రామపంచాయతీ పేర తీసుకుని రావాలన్నారు. నవాబుపేట నూతన గ్రామపంచాయతీ భవనంలో కార్యక్రమం ఉంటుందన్నారు.

కబీర్‌దాస్ జయంతి



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ విభాగం ఆధ్వర్యంలో భక్తకవి కబీర్‌దాస్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గొప్ప దార్శనీకుడైనప్పటికీ కబీర్‌దాస్ సామాన్య జీవితాన్ని గడిపాడని అన్నారు. హిందీ విభాగాధిపతి డా. నర్సింహ్మారావు కల్యాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు కవిత, సుభాషిణి, మంజుల, నందకుమార్, ఉదయ్‌కుమార్, జయలీల, ప్రవీణ్, లత, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మిడ్జిల్: విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రాకపోతే.. దరఖాస్తు చేసుకోవాలని ఏఈ జ్ఞానసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో.. తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంట్‌బిల్లు పేపర్, ప్రజాపాలన రసీదు తీసుకుని వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యా సామగ్రి పంపిణీ



అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ట్రాక్టర్ లోన్స్ సీనియర్ మేనేజర్ పి.రజినీకాంత్‌రెడ్డి విద్యార్థులకు శనివారం పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. 139 మంది విద్యార్థులకు జామెట్రీ బాక్సులు కూడా అందజేశారు. హెచ్ఎం నాగయ్య తదితరులు ఉన్నారు. అదేవిధంగా పోల్కంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం పిల్లలకు నర్సింహ్మశర్మ ఉచితంగా పలకలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి విద్యార్థులకు కూడా పలకలను అందజేశారు. శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, సురేష్, తిరుపతిరెడ్డి, మహేష్, సాయిలు, నర్సిములు, రాజు తదితరులు ఉన్నారు.

డైరెక్టర్‌గా కల్వకన్నయ్య



దేవరకద్ర: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కల్వ కన్నయ్యశెట్టి ది పాలమూర్ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం బ్యాంకు అధికారి నుంచి ఉత్తర్వు కాపీని అందుకున్నారు. దేవరకద్రకు చెందిన పలువురు వ్యాపారులు కన్నయ్యను అభినందించారు.

బీసీలకు పెద్దపీట వేయాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేయాలని... ఎక్కువ మందికి స్థానం కల్పించాలని.. బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌సాగర్ ఓ ప్రకటనలో శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10 శాతం కూడా లేని అగ్రకులాలకు పదవులు ఇచ్చి 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు అన్యాయం చేయడం తగదన్నారు. మంత్రి వర్గ విస్తరణలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. మొత్తంగా మంత్రి వర్గంలో భర్తీ చేయవలసిన 6 స్థానాల్లో సింహభాగం బీసీలకు కేటాయించాలని కోరారు.



దేవరకద్రలో..



గద్దెగూడెంలో..



మీనుగోనిపల్లిలో..

వైభవంగా ఏరువాక సంబురం

హన్వాడ: మండలంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల గ్రామాల్లో రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో స్థానిక ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేశారు. టంకర, వేపూర్, ఇబ్రహీంబాద్, గొండ్యాల్, కొత్తపేట, తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

చక్రాపూర్‌లో..

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో రైతులు శనివారం ఏరువాక పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించారు. ట్రాక్టర్లు, ఆటోలు, బైకులను రైతులు ముస్తాబు చేసుకుని ఇళ్ల వద్ద పూర్ణ పూజలు చేశారు. తర్వాత స్థానిక దేవాలయం నుంచి తిరుమలదేవుని గుట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ప్రదక్షిణలు నిర్వహించి తిరిగి గ్రామంలోని దేవాలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. దేవాలయం వద్ద మహిళలు బొడ్డెమ్మలు వేశారు.

గండీడ్: ఏరువాక పౌర్ణమి పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వెన్నాచేడ్, పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి, బల్సూర్‌గొండ, గండీడ్, పెద్దవార్వాల్, రుసుంపల్లి, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లో వేడుకలు కనులపండువగా జరిగాయి. గ్రామాల్లో అక్కడక్కడా ఏరువాక తోరణాలు ఏర్పాటు చేయగా.. వాటిని తెంపేందుకు యువకులు పోటీపడ్డారు.

దేవరకద్ర: మండల కేంద్రంతో పాటు కౌకుంట్ల మండల కేంద్రంలో ఏరువాక పున్నమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఏరువాక తాడును తెంచే కార్యక్రమంలో యువత సందడి చేశారు. మండలంలోని గద్దెగూడెం, మీనుగవానిపల్లె, గోప్లాపూర్ గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



హన్వాడలో ఎద్దుల బండి వద్ద పూజలు



గండేడ్ ట్రాక్టర్లతో ర్యాలీ..



చిన్నవడ్డేమాన్‌లో..

చిన్నచింతకుంట: మండలంలో ఏరువాక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏరువాక తాడును తెంపిన విజేతలకు బహుమతులు అందజేశారు.



చిన్నచింతకుంటలో..



చక్రాపూర్‌లో బొడ్డెమ్మలు వేస్తున్న మహిళలు

'గృహజ్యోతి' దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా



ఆన్‌లైన్ నమోదు పరిశీలిస్తున్న కమిషనర్

జడ్చర్ల టౌన్: గృహజ్యోతి పథకం అమలుకాని వినియోగదారులు మరోమారు పుర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పుర కమిషనర్ రాజయ్య కోరారు. గృహజ్యోతి, గ్యాస్ పథకాలకు సంబంధించి శనివారం ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలన రసీదుతో పాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్ జిరాక్స్ అందజేయాలన్నారు. గ్రామాలకు చెందిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాల్సి ఉంది.

రూ.500 గ్యాస్ పథకానికి సైతం..

రూ.500కే సిలిండర్ పథకానికి సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలన రసీదుతో పాటు ఆధార్‌కార్డు, గ్యాస్‌బుక్ జిరాక్స్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'అభయహస్తం' కింద గత జనవరిలో స్వీకరించిన దరఖాస్తులలో ఏమైనా తప్పొప్పులు ఉంటే తాజాగా సరిదిద్దుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దీంతో రెండు రోజుల నుంచి మున్సిపల్ కార్యాలయంలో ప్రజలు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులు అందజేస్తున్నారు. వీటిని శనివారం నుంచి మున్సిపల్ సిబ్బంది ఆన్‌లైన్‌లో సరిచేస్తున్నారు. కాగా, ఈనెల నుంచి 'గృహజ్యోతి' కింద జీరో విద్యుత్ బిల్లు అమలులోకి వచ్చినా కొందరికి వర్తింపజేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా సొంత ఇళ్లు లేని వారు అద్దెకు ఉన్న చోట యజమాని పేరు వేరే ఉండటంతో ఈ పథకం వర్తించదని అధికారులు చెబుతున్నారు. ఇదిలాఉండగా 'గృహజ్యోతి' కింద జీరో విద్యుత్ బిల్లు, సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తుదారులు తమ వివరాలను సరిచేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు, వంటగ్యాస్ పాస్‌బుక్కు లేదా రిసిప్టు తీసుకుని తమ కార్యాలయంలోని రూం నం.2లో సంప్రదించవచ్చన్నారు.

ఉర్సు నిర్వహణకు ఏర్పాట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలోని బాదేషా బౌలి దగ్గర ఉన్న హజ్రత్ బర్హానే బాదెషా రెహమతుల్లా అలై దర్గా 254వ ఉర్సు వచ్చే నెల 1 నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పట్లు ప్రారంభించినట్లు దర్గా ముతవల్లి డాక్టర్ గయాజ్‌పాష ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. ఉర్సు పోస్టర్లను శనివారం దర్గా ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ, జహంగీర్‌పాష ఖాద్రీ, వారిస్‌పాష, జుబేర్‌అలీ, ఆసిఫ్‌అలీ, మహ్మద్ అజీజ్ మాదుం, సైఫ్, సమద్ షర్ఫీ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మతపెద్దలు

క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేపట్టాలి



వ్యాక్సినేషన్ వివరాలు పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్

గండీడ్: గ్రామాల్లో క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయాలని గండీడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం గొల్లగడ్డలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. సంబంధిత రికార్డులు తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్‌ను సమయానుసారం నిర్వహించాలన్నారు. తద్వారా ప్రయోజనం ఎక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పోలియో టీకాల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. సిబ్బంది కూడా వ్యాక్సిన్ వేయించుకోవాల్సిన వారిని గుర్తించి ఆ సమయానికి వారు టీకాలు తీసుకునేలా చేయాలన్నారు. ఫార్మాసిస్టు శ్రీనివాస్, ఏఎన్ఎం సుగుణ తదితరులు ఉన్నారు.

పనుల్లో జాప్యం తగదు



గండీడ్: పాఠశాలల్లో జరుగుతున్న పనుల్లో జాప్యం తగదని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. శనివారం వెన్నాచేడ్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు. ఇంకా పనులు సాగుతుండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఏఈ ఇక్బాల్, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, గోపాల్, పంచాయతీ కార్యదర్శి కలీం తదితరులు ఉన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



చక్రాపూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో సీఎస్‌పీ లేబర్ కార్డు కలిగిన కార్మికులకు వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు మహ్మద్ తౌఫిక్, మహ్మద్ రెహాన్‌లు కార్మికులకు 56 రకాల పరీక్షలు చేశారు. కార్మికులకు సంక్రమించే వ్యాధులను ముందస్తుగా గుర్తించి తగిన వైద్యం అందించేందుకు వైద్య పరీక్షలను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, ఆంజనేయులు, కురుమయ్య, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి



అడ్డాకులలో మిఠాయిలు పంచుతున్న నాగిరెడ్డి



భూత్పూర్‌లో..

అడ్డాకుల: సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీపై ప్రకటన చేసి తాను రైతు పక్షపాతినని నిరుపించుకున్నారని పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కందూర్ నాగిరెడ్డి అన్నారు. శనివారం అడ్డాకులలో విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దేవరకద్రకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించడాన్ని హర్షించారు. మండలానికి త్వరలో గురుకుల పాఠశాల రానుందని తెలిపారు. అనంతరం రైతు రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలను పంచిపెట్టారు. మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, షఫి, శరత్‌రెడ్డి, వేఘనాథ్, శేఖర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, పరుషరాములు, బాలన్న తదితరులు ఉన్నారు.

భూత్పూర్: మున్సిపల్, పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. రుణమాఫీపై ప్రకటన చేయడంతో కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, రూరల్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్ గౌడ్, విజయ్ గౌడ్, హర్యానాయక్, బోరింగ్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తాం



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై వెలసిన రామలింగేశ్వరుడి ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. గుట్ట కింద నుంచి పై వరకు ఉన్న మట్టి దారిపై సీసీరోడ్డు వేయించడానికి అవసరమైన ఇసుకను తరలించుకునే విధంగా చూడాలని ఆయనను కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే స్పందిచారు. తహసీల్దార్‌ను విషయంపై ఆదేశించారు. ప్రాచీన ఆలయ చరిత్రను కాపాడేందుకు తనవంతు సాయం చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మూసాపేటలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌ను కలిసి ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. స్థానిక వాగు నుంచి సోమవారం ఇసుక తరలించుకునేలా తహసీల్దార్ అనుమతి ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్, తిరుపతయ్యగౌడ్, కృష్ణ, యాట సుధాకర్, నాగేశ్వర్‌రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న బి. చంద్రయ్య

భూత్పూర్: కార్మికుల సమస్యలకు పోరాటాలతోనే పరిష్కారం లభించే అవకాశం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. చంద్రయ్య అన్నారు. శనివారం భూత్పూర్‌లోని కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా వై. శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం సమావేశంలో చంద్రయ్య మాట్లాడారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీల్లో, గ్రామపంచాయతీలు, మిషన్ భగరీథ కాంట్రాక్టర్ కార్మికుల సమస్యలతో పాటు బీడీ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయనున్నట్లు వివరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ, ఆటో రంగాల కార్మికులకు అండగా ఏఐటీయూసీ ఉంటుందని ఆయన చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, ఆంజనేయులు, ఎర్ర నర్సింహులు, కృష్ణయ్య, భాగ్యలక్ష్మి, సోమ్లా, పెద్ద నర్సింహులు, చిన్న నర్సింహులు, సదుల్లా, రాజేష్, తిరుపతయ్య ఉన్నారు.

పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద, తెలంగాణ చౌరస్తాలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఉదయం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం అల్లీపూర్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేట్ లే-అవుట్‌ను, స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో ప్రజాపాలన 'అభయ హస్తం' దరఖాస్తులలో తప్పొప్పుల సవరణ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు.

14వ వార్డులో పర్యటించిన చైర్మన్




స్థానిక 14వ వార్డు పరిధిలోని వీరన్నపేట, ఎర్రమన్నుగుట్ట, వీరభద్రకాలనీ, పెద్దశివాలయం తదితర ప్రాంతాలలో శనివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. కాగా, ఆయా వీధుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ ఎ.అంజయ్య విన్నవించారు.

రూ. 2.10లక్షల చెక్కుఅందజేత

కొత్తకోట రూరల్: పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ బిక్కయ్య భార్య మలమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.2.10లక్షల చెక్కును మంజూరు చేయించారని మాజీ సర్పంచ్ సిద్ధయ్య, కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం తెలిపారు.

'కార్మిక సమస్యలను పరిష్కరించాలి'



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి ఎర్ర నర్సింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐసీ ఖాతాలు వెంటనే తెరిపించాలన్నారు. అర్హత కలిగిన మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు పదోన్నతి కల్పించాలన్నారు. ప్రతినెలా 1వ తేదీన వేతనాలు అందించాలని, స్వచ్ఛ ఆటోలు నడుపుతున్న వారిని అవుట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, పట్టణ అధ్యక్షుడు కె.బాలరాజు, సహాయ కార్యదర్శి చిన్నికృష్ణ, సీఐటీయూ కార్యదర్శి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సంఘం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించి ఇవే అంశాలపై చర్చించారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, జడ్చర్ల వెంకటేశ్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.